క్లుప్తంగా

రంగనాథుని సన్నిధిలో పేట ఉత్సవం



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి సన్నిధిలో భగవద్రామానుజాచార్యుల వారి అవతార ఉత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం భగవద్రామానుజాచార్యుల వారికి ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, రాత్రి పేట ఉత్సవాన్ని వైభవంగా గావించారు. దేవస్థానం ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు (పొగతోట) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. మున్సిపల్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్సార్‌టీపీ శిక్షణా కేంద్రాన్ని మంత్రి శనివారం పరిశీలించారు. సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జేడీఎం హైమావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి



నెల్లూరు(బృందావనం) : శని త్రయోదశి సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని నవగ్రహాలకు భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. శని భగవానునికి ప్రత్యేకంగా భక్తులు తైలాభిషేకం గావించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా ఆశ్రిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ముంగమూరు ఆశ్రిత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం నగర పార్టీ కార్యాలయంలో విద్యార్థి నాయకులు ఘనంగా నిర్వహించారు. నగర పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవ, ఇతర నాయుకులు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి నాయకులు చంద్ర, ఉమర్, శరత్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో..

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో మాగుంట లేఅవుట్‌లో ఆశ్రిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. రోహిత్ రెడ్డి, రవిచంద్ర, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, శరత్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : మే 15వ తేదీకి 303 అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

29న కంచి వర్సిటీ ప్రవేశానికి ఎంపికలు

నెల్లూరు(బృందావనం) : కాంచీపురంలోని కంచి కామకోటి పీఠానికి చెందిన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం–డీమ్డ్ యూనివర్సిటీలో 2025–2026 సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలు మూలాపేటలోని శంకరమఠంలో ఈనెల 29న జరుగుతుందని మఠం నిర్వాహకుడు కొర్రపాటి నందకిషోర్ శనివారం తెలిపారు. ఇంజినీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్‌మెంట్, ఇతర యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశం కోసం ఈనెల 29న స్పాట్ అడ్మిషన్స్‌ను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

• బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు



నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఎస్సై బాలకృష్ణ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

నెల్లూరు(క్రైమ్) : దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా పోలీసు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. రద్దీ ప్రాంతాలైన రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్‌మాల్స్‌ను బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వేలిముద్రలను ఫిన్స్ సాయంతో పరిశీలించారు. లాడ్జీల్లో బస చేసిన వ్యక్తుల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ప్రతిరోజు లాడ్జీలో బసచేసిన వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌కు అందజేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రోన్లతో శివారు ప్రాంతాలపై నిఘా పెంచారు. వాహన తనిఖీలు కొనసాగిస్తున్నారు. మందుబాబులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగర పోలీసు అధికారులు చిట్టెం కోటేశ్వరరావు, దశరథరామారావు, రోశయ్య, సాంబశివరావు, జిల్లాలోని పోలీసు అధికారులు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



కావలిలోని లాడ్జీలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ గిరిబాబు



స్థానికులతో మాట్లాడుతున్న వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

వేదగిరి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

• అధికారులు సమన్వయంతో పనిచేయాలి
• నెల్లూరు ఆర్డీఓ అనూష



సమావేశంలో అధికారులు, నాయకులు

నెల్లూరు సిటీ : అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నరసింహకొండలోని వేదగిరి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నెల్లూరు ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. నరసింహకొండ ఆలయంలో అన్నిశాఖల అధికారులు, ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వేదగిరి బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మే 10 నుంచి 12 వరకు నరసింహకొండ సమీప ప్రాంతాల్లో బ్రాందీ షాపులు నిర్వహించకూడదన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. కోనేరుల వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. సమావేంలో అన్నిశాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్టు కుటుంబసభ్యులకు పరామర్శ



రామచంద్రప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి



మెట్టు రామచంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంగారెడ్డి

నెల్లూరు సిటీ : వీఆర్సీ కళాశాల మాజీ తెలుగు అధ్యాపకుడు, 'పద్యకళా పరిషత్' అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. 33వ డివిజన్‌లోని పొదలకూరురోడ్డులో ఉన్న మెట్టు రామచంద్రప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, నాయకులు మురళి యాదవ్, జగన్నాథం శ్రీనివాస్, రవీంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ కుటుంబసభ్యులను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి శనివారం పరామర్శించారు. పొదలకూరురోడ్డులో ఉన్న రామచంద్రప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు స్వర్ణ వెంకయ్య, ఎం.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఉగ్రవాద చర్యలను ఖండించాలి



ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరురూరల్ : ఉగ్రవాద చర్యలను ఖండించాలని కోటమిట్ట మహాలక్ష్మిగుడి నుంచి పాత ములుమూడి బస్టాండ్ వరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రశాంతమైన భారతదేశంలో అక్రమంగా చొరబడి మారణహోమం సృష్టిస్తున్న ఉగ్రవాదుల చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి పాత ములుమూడి బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నివాళులర్పిస్తూ మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హేమంత్, బాలాజీ, పెంచలయ్య, సత్య, మురళి, అంకయ్య, మస్తాన్, మాల్యాద్రి, మహేంద్ర, సెల్వం, అనిల్, సతీష్, శ్రీనివాసులు, తేజ, రాము, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో..

• నెల్లూరు(బృందావనం) : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ, మృతిచెందిన వారి ఆత్మశాంతి కోసం జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పొదలకూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఎదుట నుంచి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నలుబోలు బలరామయ్యనాయుడు, సీఎల్ఎన్ ప్రసాద్, చెంచయ్య, వీఎస్ ప్రసాద్, ఖాజా మస్తాన్, వెంకటరమణయ్య, రాజగోపాల్, వి.వెంకటేశ్వర్లు, హర్షవర్ధిని, సావిత్రమ్మ, మేరిబ్లెస్సింగ్టన్, హరిసుధ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సర్వీసులను పూర్తి చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ విద్యుత్ సర్వీసులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ జిల్లా స్టోర్స్‌లో అందుబాటులో ఉన్నాయని, సంబంధిత విద్యుత్‌శాఖ ఏఈలు వాటిని డ్రా చేసుకుని యుద్ధ ప్రాతిపదికన సర్వీసుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఎస్ఈ విజయన్ తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలీల సంఖ్యను పెంచండి

నెల్లూరు (పొగతోట) : ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను లక్ష్యకు పెంచేలా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ గంగాభవానీ మండలాధికారులను ఆదేశించారు. డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలతో శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. కూలీలకు అవగాహన కల్పించి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాంటేషన్, పంట గుంతలు తదితర కార్యక్రమాలను వేగవంతం చేయాలని తెలిపారు.

అప్రమత్తతతో మలేరియాకు చెక్

నెల్లూరు(అర్బన్) : ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియాను నిర్మూలించవచ్చని మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి కన్సెల్టెంట్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్టులు పెంచలప్రసాద్, రవీంద్రరెడ్డి, విజయకుమార్‌లు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లాలో దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. దోమ కుట్టిన పది రోజుల తర్వాత చలి, జ్వరం, తలనొప్పి లక్షణాలతో మలేరియా వ్యాపిస్తోందన్నారు. మలేరియా తీవ్రమైతే కాలేయం, కిడ్నీలు, మెదడు లాంటి అవయవాలు దెబ్బతింటాయన్నారు. మలేరియా చికిత్స కన్నా దోమలు కుట్టకుండా చూసుకోవడం ద్వారా జబ్బు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, పిఆర్వో చందువర్మ పాల్గొన్నారు.

దేవుడి మాన్యాలను రక్షించండి

నెల్లూరురూరల్ : ఆక్రమణకు గురవుతున్న దేవుని మాన్యాలను రక్షించాలని చేజర్ల మండలం చిత్తలూరు గ్రామ ప్రజలు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. మా గ్రామంలోని చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాలకు సంబంధించిన దేవుని మాన్యాలకు వేలం పాట, పూజారికి జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ దగ్గర కస్తూరిదేవి గార్డెన్స్ ఎదురుగా ఉన్న మైదానంలో రాయల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'క్రాఫ్ట్ బజార్ చేనేత, హస్త కళా ప్రదర్శన, అమ్మకాలను' శనివారం టీడీపీ నేతలు భానుశ్రీ, గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ధనుంజయరాజు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్త కళాకారులకు చేయూతనందించాలన్న లక్ష్యంతో 30కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని 39వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం నేత తౌఫిక్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజాసేవ చేయడంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లప్పుడు ముందుంటారని తెలిపారు.

కార్మికులు, చిరు వ్యాపారులు ఐక్యంగా ఉండాలి



కోనేరు మార్కెట్‌లో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న కోనేరు కూరగాయల మార్కెట్‌లో కార్మికులు, చిరువ్యాపారులు ఐక్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మార్కెట్‌లో సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఏసీ సుబ్బారెడ్డి మార్కెట్, కోనేరు మార్కెట్‌లతో పాటు బయట కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకుంటున్న చిరు వ్యాపారులు కలిసి ఉండాలని, వీరికి సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్మిక దినోత్సవంలో అందరూ పాల్గొనాలని, మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కూడా పాల్గొన్నాలని కోరారు. అనంతరం 18 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా మోహన్, సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, పార్టీ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచల నరసయ్య, నాయకులు సతీష్, నరసింహారెడ్డి, గిరిబాబు, భాస్కర్‌రెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశువైద్య దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

నెల్లూరు సిటీ : ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని నగరంలోని ఆర్వీఎస్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం కోసం ఉద్యోగులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. దేశ జీడీపీ పెంపులో పశుజాతుల ఉత్పత్తి కూడా ఉందన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. డాక్టర్స్ వెట్ ఫార్మా చైర్మన్ చలమయ్య, డాక్టర్ సోమయ్య, కృష్ణమౌర్య, ప్రసాద్, జయప్రకాష్, అరుణ, చైతన్య, జయచంద్ర, వసంతరాయులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం జరిగితే సహించం



సమావేశంలో మాదిగ నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన రోస్టర్ పాయింట్‌లో మాదిగలకు అన్యాయం జరుగుతోందని, దీనిని సహించేది లేదని పందింటి సుబ్బయ్య మాదిగ డిమాండ్ చేశారు. నగరంలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్లో మాదిగ జేఏసీ నేతల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ గత 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, అయితే ఇందులోని లోపాలను సరిదిద్దాలన్నారు. మాదిగలకు న్యాయం చేసే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ, ఎస్సీ ఎస్టీ, బీసీ యునైటెడ్ ఫోరం నేతలు దేగ రవి, రాఘవేంద్ర, విజయ్‌కుమార్, మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, మాదిగ జేఏసీ నేతలు కొమ్మల కృష్ణయ్య, జనార్దన్, శేఖర్, రత్నయ్య, అంకయ్య, లక్ష్మయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిర్వహణకు సిబ్బందిని కేటాయించాలి



తెలుగుగంగ ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరురూరల్ : జిల్లాలో నీటి నిర్వహణకు సిబ్బందిని కేటాయించాలని తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణారెడ్డికి బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమశిల, కండలేరు డ్యాములతో పాటు ఉమ్మడి జిల్లాలో 1,720 చెరువులు, 2,200 పంట కాలువలు, చిన్న కాలువలు రూ.లక్ష కోట్ల విలువ చేస్తాయని, నిధులు లేని కారణంగా నీటి వృథా ఎక్కువగా ఉందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఫ్యాషన్ టైలరింగ్, ష్రింప్, ఫిష్ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణ శనివారంతో ముగిసింది. దాదాపు 35 రోజుల పాటు టైలరింగ్ శిక్షణలో జిల్లాకు చెందిన 15 మంది, ష్రింప్, ఫిష్ శిక్షణలో 22 మంది మహిళలు శిక్షణ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గిరి తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

ఈ సందర్భంగా కోరమండల్ కంపెనీకి చెందిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో కోరమండల్ మేనేజర్ రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేరుస్తా

• మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ : ఎన్నికల సమయంలో 94 వేల నివాసాలను సందర్శించా, వారికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా అని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో అధికారులు, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం గతంలో ఉన్న పురసేవను మనమిత్రగా మార్చి సేవలందిస్తున్నామన్నారు. ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఆర్ హైస్కూల్‌ను పునరుద్ధరించి నిరుపేదలకు నాణ్యమైన ఉచిత విద్యనందిస్తామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ తహసీన్, నాయకులు విజేతరెడ్డి, తాళ్లపాక అనూరాధ, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టులను పునఃప్రారంభిస్తాం

నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, తాగునీటి ప్రాజెక్టులను మే 15లోగా పునఃప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. తొమ్మిదో డివిజన్‌లోని రాయపాళెం అంబేద్కర్ పార్కును ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో చిన్నారుల కోసం అధునాతన ఆట వస్తువులను ఏర్పాటు చేశారన్నారు. నగరంలో 46 పార్కుల్లో జిమ్ పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వాటర్ ప్రాజెక్టులను వచ్చే నెల 15లోగా పునఃప్రారంభిస్తామన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్, కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్ పాల్గొన్నారు.

వీఆర్ కళాశాలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం

నెల్లూరు (టౌన్) : నగరంలోని వీఆర్ కళాశాలకు పూర్వ వైభవాన్ని తీసుకు రానున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆయన జేసీ కార్తీక్‌తో కలిసి వీఆర్ కళాశాల పునరుద్ధరణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల వసతులపై ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కళాశాల మైదానంలో పాడుబడిన బిల్డింగ్‌ను తొలగించి దానిని మంచి ఆట స్థలంగా అభివృద్ధి చేయాలన్నారు. పేద పిల్లలకు వీఆర్ కళాశాలలో ఉచిత విద్యతో పాటు బస్సు, టిఫన్, మధ్యాహ్న భోజనం, స్నాక్స్‌ను అందించనున్నట్లు చెప్పారు.